క్లుప్తంగా

వరి నారుమడులకు ఊపిరినిచ్చిన వర్షాలు



ముకుందపురంలో ఏపుగా పెరిగిన వరినారు

మాడుగుల రూరల్ : గత పదిహేను రోజులుగా కాస్తున్న ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకానికి గత మూడు రోజులుగా ఆడపాదడపా కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. వరి నారుమడులకు ఊపిరిలూదాయి. వర్షాలు కురవకపోయినా వరుణుడు కరుణిస్తాడనే ధైర్యంతో రైతులు ఖరీఫ్ వరి విత్తనాలు వేశారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో వరి నారుమడులు ఏపుగా పెరిగాయి. తాచేరు, శారద, పెద్దేరు, నదుల్లో నీరు చేరింది. ఇంకా వరి నారు వెయ్యని రైతులు ఈ వర్షాలతో నారుమడులు సిద్ధం చేసి, వరి విత్తనాలు వేస్తున్నారు.

ఎ. కొత్తపల్లి పాల సంఘం అధ్యక్షుడిగా దేముడు



అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దాడ దేముడు

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లి విశాఖ డెయిరీ పాల సంఘం-1 అధ్యక్షుడిగా పెద్దాడ దేముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక పాల సంఘం-1లో విశాఖ డెయిరీ ప్రతినిధుల సమక్షంలో గురువారం ఎన్నికలు జరిగాయి. ఈ పాల సంఘం పరిధిలోని 10 మంది డైరెక్టర్లు ఉండగా వీరంతా పెద్దాడ దేముడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన దేముడును స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అభినందించారు. ప్రశాంతంగా ఎన్నిక నిర్వహణకు సహకరించిన సభ్య రైతులకు, ప్రజలకు సర్పంచ్, వైస్ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

వరి ఆకుపోత పనుల్లో రైతులు నిమగ్నం



నారుమడిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు రాజు

రోలుగుంట : మండల రైతాంగం నారుమడుల్లో వరి ఆకు పోత పనుల్లో నిమగ్నం అయ్యారు. గత నెలలో రైతులు ఖరీఫ్ సాగు కోసం దుక్కులు చేసుకుని నారుమడులు సిద్ధం చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్. విజయలక్ష్మి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీ విత్తనాలు ఇప్పటికే అందజేశారు. వర్షాలు మొదలై కలిసొచ్చే వాతావరణం కావడంతో గురువారం కంచుగుమల, రోలుగుంట, కొండపాలెం, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో రైతులు వరి ఆకు పోత పనులు చేపట్టారు. ఈ ఏడాది నారు అభివృద్ధికి ఢోకా ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నూతన హెచ్ఎంల బాధ్యతల స్వీకరణ



నూతన హెచ్ఎం పద్మావతి



బాధ్యతలు చేపడుతున్న నాగేశ్వరరావు

కె.కోటపాడు : కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఎస్.వి.పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గోపాలపట్నం పాఠశాల నుండి బదిలీపై పద్మావతి కె.కోటపాడు పాఠశాలకు వచ్చారు. ఆమెకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందేలా కృషి చేస్తానని హెచ్ఎం పద్మావతి పేర్కొన్నారు.

కొత్తకోట హైస్కూల్ హెచ్ఎంగా నాగేశ్వరరావు

రావికమతం : కొత్తకోట పెంటపాటి సూర్యారావు మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా కె.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి హెచ్ఎం బ్రహ్మాజి విద్యాశాఖాధికారి-2గా పదోన్నతి పొందడంతో లక్కవరం హైస్కూల్ ఉపాధ్యాయుడిగా ఉన్న నాగేశ్వరరావు ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు.

జగనన్న సురక్షతో పారదర్శక సేవలు

- బుచ్చెయ్యపేటలో ఒక్కరోజే 1,259 మందికి సర్టిఫికెట్ల అందవేత



వడ్డాదిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నాయకులు



చోడవరం సచివాలయం-3 సభలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు



జె.నాయుడుపాలెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్‌లు వెంకటరమణ, రామకృష్ణ

బుచ్చెయ్యపేట : జగనన్న సురక్షలో భాగంగా బుచ్చెయ్యపేట మండలంలో ఒక్కరోజే 1,259 మంది లబ్ధిదారులకు అధికారులు పలు సర్టిఫికెట్లు అందించారు. గురువారం మేజర్ పంచాయతీ వడ్డాది -1 సచివాలయంలో 519 మందికి, రాజాంలో 740 మంది లబ్ధిదారులకు జగనన్న సురక్ష గ్రామ సభల్లో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు చేతుల మీదగా అందించారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు కోరుకొండ కామలక్ష్మి, సూరి అప్పారావు, మరిసా నాని, వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, కోపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

837 అర్జీలకు పరిష్కారం

చోడవరం : ప్రజలకు సత్వర సేవలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పప్పల జయదేవ్ అన్నారు. మండలంలో చోడవరం సచివాలయం-3, వెంకన్నపాలెం సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. గతంలో ఏ ధ్రువపత్రం కావాలన్నా కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు జగనన్న సురక్షతో కేవలం ఒక్క రోజులోనే 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. ఈ సభల్లో వెంకన్నపాలెం సభలో 374 అర్జీలు రాగా అక్కడికక్కడే 227 అర్జీలను పరిష్కరించారు. చోడవరం సచివాలయం-3 సభలో 813 అర్జీలకు గాను 607 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, గ్రామ సర్పంచ్‌లు మొల్లి ఈశ్వరరావు, బండి నూకాలమ్మ, వైస్ ఎంపీపీలు బైన కుమారిఈశ్వరరావు, జగ్గారావు, ఎంపీటీసీ అరుణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు డి. వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి, మండల బీసీసెల్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు పాల్గొన్నారు.

జె.నాయుడుపాలెం గ్రామంలో..

రోలుగుంట : జె.నాయుడుపాలెం గ్రామంలో ఎంపీడీవో కె.ప్రభాకర్రావు తన బృందంతోను, కొంతల గ్రామంలో తహసీల్దార్ వరహాలు తన బృందంతోను సర్పంచ్‌ల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ప్రజలకు పలు ధ్రువపత్రాలు అందజేశారు. మండల కార్యాలయాలకు వెళ్లకుండా నేరుగా సచివాలయాల పరిధిలో కోరిన ధ్రువపత్రాలు జారీ చేయడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమాల్లో జె.నాయుడుపాలెం సర్పంచ్ బగుడు వెంకటరమణ, పడాలపాలెం సర్పంచ్ పాచిలి రామకృష్ణ, కొంతలం సర్పంచ్ కుంచంగి వంశీ, మాజీ సర్పంచ్ కుంచంగి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పెదబొడ్డేపల్లి సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అంటరాని తనాన్ని పారద్రోలేందుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు కొనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, రోజా, డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం, కౌన్సిలర్ రత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిఘట్టంలో...

బలిఘట్టంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి నివాసంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

ఓమ్మలిలో..

మాడుగుల రూరల్ : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి గురువారం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు బెన్నవోలు పరదేశినాయుడు అధ్యక్షతన ఓమ్మలిలో నిర్వహించారు. జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ ఎలుసూరి గాటీలు, జేబీ అప్పారావు, ఎలుసూరి అప్పారావు, ఎలుకా రాజేశ్, ఎలుకా కొండమ్మా తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో..

నాతవరం: మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులు అర్పించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, తహసీల్దార్ ఎస్ఎస్‌వి శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతురాలు మేరీ భర్త ఆనందరావుకు బీమా సాయం అందజేస్తున్న సర్పంచ్ గణేశ్

మాడుగుల రూరల్ : మండలంలో ముకుందపురం గ్రామానికి చెందిన కూడా మేరీ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ బీమా పథకంలో ఆమె కుటుంబానికి రూ. ఒక లక్ష మంజూరు కాగా, తక్షణ సాయంగా రూ. పది వేల నగదును గురువారం సాయంత్రం సర్పంచ్ కర్రి గణేశ్ మృతురాలి భర్త ఆనందరావుకు అందజేశారు. స్థానిక వెల్ఫేర్ సహాయకులు రమణబాబు, నాయకులు కర్రి నాయుడుబాబు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు

రావికమతం : టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామి వారికి గురువారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా పలువురు దంపతుల చేతుల మీదుగా అర్చకుడు లక్ష్మణరావు దూర్వాయుగ్మార్చన, ప్రత్యేక పుష్పార్చన, సుగంధ ద్రవ్యాలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

గ్రామానికి మౌలిక వసతులు

మునగపాక : అందరి సహకారంతో మునగపాక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించేందుకు శక్తివంచన లేకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కె.కోటపాడు : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 7న విశాఖలో జరపనున్న 24 గంటల దీక్షలకు సంబంధించిన గోడపత్రికలను గురువారం ఎ.కోడూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు, దేముడు మాట్లాడుతు బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు, వనుము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల దీక్షను విజయవంతం చేయండి

నర్సీపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం జీవీఎంసీ వద్ద చేపట్టనున్న24 గంటల దీక్షను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. దీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సీపీఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

కె.కోటపాడు : ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని గుల్లేపల్లి హెల్త్ వెల్‌నెస్ భవనంలో గురువారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఐదేళ్ల లోపు 11 మంది చిన్నారులకు టీకాలతో పాటు నలుగురు గర్భిణులకు ధనుర్వాత నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమాన్ని హెల్త్ అసిస్టెంట్ రాజు పర్యవేక్షించారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు బ్యాచ్‌లకు ముగిసిన శిక్షణ

మాకవరపాలెం: నూతన విద్యా బోధనపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో మూడు బ్యాచ్‌లకు శిక్షణ ముగిసింది. త్వరలో చేపట్టనున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) బోధనా విధానంపై అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 1 నుంచి శిక్షణ ఇస్తున్నారు. సుమారు 400 మంది ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వగా, గురువారంతో మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు.

రైతులకు సబ్సిడీ దాణా పంపిణీ

దేవరాపల్లి : మండలంలోని ఎం. అలమండ గ్రామంలో సమీకృత దాణాను స్థానిక సర్పంచ్ దాడి జగన్, వీఆర్‌వో పోతల శంకరరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందిస్తున్న దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీ పోను కేజీ రూ. 6.50 చొప్పున రైతులకు అందిస్తుందన్నారు. ఎం. అలమండలో సుమారు 2 వేల కేజీల సమీకృత దాణాను అందజేసినట్లు స్థానిక పశు వైద్యాధికారి కె.మంజుష తెలిపారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష సమగ్ర భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి తహసీల్దార్ ఎం. లక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేరులతో మాట్లాడారు. వేచలం, ఎం. అలమండ గ్రామాల్లో సర్వే జరుగుతున్నందున భూ యజమానులు సర్వే చేయించుకోవాలన్నారు. భూమి పత్రాలతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలను సర్వే బృందానికి అందించి సహకరించాలని ఆమె సూచించారు. కలిగొట్లలో ఇప్పటికే సర్వే పూర్తయిందని, సర్వే వివరాలతో నోటీసులను సదరు రైతులకు అందజేశామని, సర్వేలో భూమి వివరాలను చెక్ చేసుకోవాలని సూచించారు.

పది పాసైన దివ్యాంగ విద్యార్థులకు అభినందన

రావికమతం : పదవ తరగతి పరీక్షలు పాసైన దివ్యాంగ విద్యార్థులను ఎంపీడీవో వెంకన్నబాబు, ఎంఈవో-2 బ్రహ్మజీ గురువారం అభినందించారు. భవిత కేంద్రంలో 17 మంది దివ్యాంగ విద్యార్థులు వివిధ హైస్కూళ్లలో పది పరీక్షలు రాశారు. పరీక్షలు రాసిన 17 మందికి గాను 17 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే మండలంలోని దివ్యాంగులందరికీ జాతీయ గుర్తింపు కార్డుల నమోదు పక్రియ ప్రారంభించారు. గురువారం ఒక్కరోజే 97 మంది నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుని జాతీయ గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడివాడ హెచ్ఎం వి.రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

తెనుగుపూడిలో వైఎస్సార్ జయంతి వేడుకలు రేపు

దేవరాపల్లి : తెనుగుపూడిలో మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ఉప ముఖ్యంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. కలెక్టర్ రవి పటాన్‌శెట్టితో కలిసి పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారన్నారు.

నేడు జగనన్న సురక్ష సమావేశాలు

కె.కోటపాడు : మండలంలో గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష సమావేశాలు జరపనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఉదయం 9.30కు ఈ సమావేశాలను నిర్వహించనున్నామని అన్నారు. ఈ సమావేశాల్లో 11 రకాలైన పౌరసేవలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు శచీదేవి తెలిపారు.

ఓమ్మలిలో గడప గడపకు మన ప్రభుత్వం నేడు

మాడుగుల రూరల్ : మండలంలో ఓమ్మలి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఓమ్మలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొద్దాపు భాస్కరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని ఏఈ జీవీ రాజు తెలిపారు. ఆయా గ్రామాల వ్యాపారులు, అధికారులు, ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో..

నర్సీపట్నం: మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌శాఖ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు నుండి నర్సీపట్నం, బలిఘట్టం, 33/11కేవీ పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జోగినాథునిపాలెం, సుబ్బరాయుడుపాలెం, ధర్మసాగరం, చెట్టుపల్లి, పెదబొడ్డేపల్లి గ్రామాలతో పాటు గబ్బాడ 33 కేవీ సబ్‌స్టేషన్, ఏటిగైరంపేట, మాకవరపాలెం సబ్‌స్టేషన్లోని గ్రామాల్లో ఉదయం నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : టీడీపీ హయాంలో కొందరికే సంక్షేమ పథకాలు అందేవని.. జగనన్న ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా 12వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నూతనంగా నిర్మించిన పలు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైస్ చైర్మన్లు కొనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, అర్జున్, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, టౌన్ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్లు సమ, లోకవరపు శారద, పార్టీ నాయకులు యాదిగిరి శేషు, కణితి అన్నపూర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు అంకితభావంతో పని చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై సభ్యులు తీవ్రస్థాయిలో అధికారులను నిలదీశారు. సచివాలయాల్లో నియమించిన విద్యుత్ శాఖ లైన్‌మేన్లు గ్రామాల్లో పని చేయడం లేదని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగారు. విద్యుత్‌శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎంపీపీ ఆదేశించారు. వెదురుపల్లిలో లక్షలాది రూపాయలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేసారని సర్పంచ్ సత్యనారాయణ అడిగారు. మండలవ్యాప్తంగా అయిదు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అలాగే ఉన్నాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఎంపీపీ అన్నారు. యుద్ధప్రతిపాదికన సమస్య పరిష్కారించాలని ఆదేశించారు. అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు అందించాలని సరుగుడు మర్రిపాలెం సర్పంచులు అడిగారు. వరి విత్తనాల పంపిణీ జరగలేదని సర్పంచ్ సోమల చింతల్లి అడిగారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నా కొంతరు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాంటి అధికారులు పని తీరులో మార్పు రాకపోతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌కు ఫిర్యాదు చేస్తామని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్, రజాక్ అన్నారు. తహసీల్దార్ ఎస్ఎస్‌వి శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి సూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పీఆర్‌డీఈ ఈశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

గొలుగొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మండల సర్వసభ్య సమావేశం నిర్వహణ అని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏవో సుధారాణి తెలిపారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, వెంటనే పనులు పూర్తి చేయాలని పీఆర్ డీఈఈ ఈశ్వర్రావు తెలిపారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకట గిరిబాబు, ఎంపీడీవో డేవిడ్‌రాజు, తహసీల్దార్ ఆనందరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లు సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జంతువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



కె.కోటపాడులో శునకాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి



ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

కె.కోటపాడు : జంతువుల పెంపకంలో జాగ్రత్తలను పాటించాల్సిన అవసరం ఉందని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి. బైరాగి అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమంలో భాగంగా గురువారం పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేశారు. జంతువుల నుండి మనుషులకు రోగాలు సంక్రమించడాన్ని గుర్తు చేసే రోజు జూనోసిస్ డే అని ఆయన తెలిపారు. అదే విధంగా కొరువాడ పశువైద్య కేంద్రంలో కూడా పశువైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సిబ్బంది సమీరా తదితరులు పాల్గొన్నారు.

35 కుక్కలకు ఉచిత రేబిస్ టీకా

రావికమతం : కొత్తకోట పశువైద్య కేంద్రంలో 35 పెంపుడు కుక్కలకు గురువారం రేబిస్ టీకా ఉచితంగా వేశారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్కల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణకు ఏటా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు విధిగా తమ పెంపుడు కుక్కలకు టీకా వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, తట్టబంద వైద్యాధికారి జీవీఎస్ నూకేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో రక్షణ..

మాడుగుల : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. గురువారం స్థానిక ఆర్‌సీఎం బాలికోన్నత పాఠశాలలో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేబిస్ నిరోధక టీకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి, వార్డు మెంబర్లు, బూసాల అప్పలరాజు, ఎడ్ల హేమంత్ కుమార్, కుక్కర శ్రీధర్, పశు వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పశు వైద్యశాలలో..

నర్సీపట్నం: ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వంద కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యు. రాంబాబు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎం. అలమండలో..

దేవరాపల్లి : ప్రతి ఒక్కరూ పెంపుడు కుక్కలకు ప్రభుత్వం ఉచితంగా అందించే రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎం. అలమండ పశువైద్యాధికారి కె. మంజుష తెలిపారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు గురువారం ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు.

జాగ్రత్తలు పాటించాలి..

రోలుగుంట : పెంపుడు కుక్కల పట్ల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు కోరారు. మండలంలో గల కుసుర్లపూడి, బుచ్చింపేట, రోలుగుంట పశు వైద్య కేంద్రాల్లో గురువారం ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవాన్ని నిర్వహించారు.